క్లుప్తంగా

మా ఓట్లన్నీ హరీశ్‌రావుకే



ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మా ఓట్లన్నీ మంత్రి హరీశ్‌రావుకే వేస్తామని మండల పరిధిలోని ఓబులాపూర్ మధిర గ్రామం శంకరాయకుంట గ్రామస్తులు సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సిద్దిపేటలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు మంత్రి హరీశ్‌రావుకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐలయ్య, ఎంపీటీసీ పద్మ మల్లేశం, శంకరాయకుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు మామిడాల జయరాం, ఎంపీటీసీ భర్త మధుసూదన్‌రెడ్డి, వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నర్సయ్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపో పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉంటే 9959226271 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో బీజేపీ జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ చింత రాంచందర్‌రావు, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్‌పాటిల్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో జరిగిన బీజేపీ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాలు గజ్వేల్ చుట్టే తిరుగుతాయని, రాబోయే రోజుల్లో పెనుమార్పులు చోటు చేసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా సౌకర్యం హర్షణీయం

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్‌ఎస్ ఎన్నికల హామీలో రేషన్ కార్డు కలిగిన నిరుపేదలకు బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇవ్వడం హర్షనీయమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఏగొండ స్వామి, రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, ఉపాధ్యక్షుడు భీం శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌టీపీ టికెట్ కేటాయించండి



దరఖాస్తును అందజేస్తున్న అశోక్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌టీపీ తరపున పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతూ మండలంలోని అన్నసాగర్ గ్రామానికి చెందిన పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి చింతల అశోక్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు హైదరాబాద్ లోటస్ పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డికి సోమవారం తన దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ నీలం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె గదుల కేటాయింపు

హుస్నాబాద్: పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదులను కిరాయి ఇచ్చేందుకు సోమవారం బాక్స్ టెండర్ ప్రక్రియ ద్వారా గదులు కేటాయించారు. ఈనెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బాక్స్ టెండర్‌ను ఓపెన్ చేశారు. 20 గదులకు గాను 9 గదులకు మాత్రమే టెండర్లు వేశారు. ఇందులో అందరి కంటే ఎక్కువ రుసుం రాసిన వారికి గదులను కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. మిగిలిన గదులకు వారం రోజుల్లో మళ్లీ బాక్స్ టెండర్ ఆహ్వానిస్తామని తెలిపారు.

జగజ్జననీ జయ వందనం



వర్గల్: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

జిల్లావ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం భక్తులు సామూహిక కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపాక మండలం మర్పడ్గ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురు మాదనానంద సరస్వతి, పీఠాధిపతులు మాధవానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. వర్గల్ క్షేత్రంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు నేత్రపర్వం చేస్తున్నాయి. రెండోరోజు సకల మంత్రాలకు అధిదేవత గాయత్రీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.



గజ్వేల్: భక్తుల ప్రత్యేక పూజలు



నంగునూరు(సిద్దిపేట): భక్తుల కుంకుమార్చన



దుబ్బాకలో..



గజ్వేల్‌రూరల్: అమ్మవారికి లక్ష పుష్పార్చన

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రవల్లిలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పరిపాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్‌లోని వైష్ణవి గార్డెన్‌లో పట్టణంలోని 13వ వార్డుకు చెందిన తాళ్ల నరేష్‌గౌడ్‌తో పాటు యువకులు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్ సమీర్, నాయకులు గుంటుకు రాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

దుబ్బాక: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బాలాజీ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. దుబ్బాక నియోజకవర్గం మాజీ మంత్రి ముత్యంరెడ్డి హయాంలోనే అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతుల శ్రీనివాస్, వెంకట్ గౌడ్, రాజిరెడ్డి, భరత్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కేసీఆర్ హామీలు నీటి మూటలే

హుస్నాబాద్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నీటి మూటలేనని బీజేపీ నియోజకవర్గ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఆమె మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చారని పదేళ్లు గడిచినా నేటికీ ఒక్క హామీ నేరవేరలేదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పేర్కొనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఊరికో బెల్ట్ షాపు పెట్టి ప్రజలను మద్యానికి బానిస చేశారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, కౌన్సిలర్ వేణు యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, వివిధ మండలాల అధ్యక్షులు వీరాచారి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకురాలు మంజులారెడ్డి

కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టారు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/చిన్నకోడూరు: కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్‌ఎస్ కాపీ కొట్టిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో అమలుకు నోచుకునే విధంగా లేదని విమర్శించారు. కార్యక్రమంలో నంగునూరు మండల అధ్యక్షుడు శంకర్, పట్టణ కార్యదర్శి మధు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గయసుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ అర్బన్ అధ్యక్షుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నకోడూరులో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకే దిక్కులేదని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, పరశురాం, జయంత్, నరేష్, శేఖర్ ఉన్నారు.



సిద్దిపేట: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి



బహుమతులు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

తొగుట(దుబ్బాక): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. జోనల్ మీట్‌9లో భాగంగా మండలంలోని అల్వాలలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టపడి చదివిన విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు. సమాజంలో విద్యావంతులకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల సంయుక్త కార్యదర్శి అనంతలక్ష్మి, సిద్దిపేట ఆర్‌సీఓ నిర్మల, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోనాయిపల్లి, పోసాన్‌పల్లి, బందారం, తిరుమలాపూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు సీఎం కేసీఆర్ వైపు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి



తీర్మానపత్రాన్ని మంత్రి హరీశ్‌రావుకు అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమైందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం చిన్నకోడూరు రెడ్డి సంఘం సభ్యులు హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ ఉమేష్ చంద్ర, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, రెడ్డి సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



చేర్యాల: నినాదాలు చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట)/కొమురవెల్లి/మద్దూరు: జనగామలో సోమవారం సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు చేర్యాల, కొమురవెల్లి మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. కొమురవెల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, బ్లాక్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చేర్యాల పట్టణ పరిధిలోని 12 వార్డులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, తదితరులు సభకు తరలివెళ్లారు. మద్దూరు నుంచి ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, సర్పంచ్ దీపిక ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న డిపో మేనేజర్ సురేఖ

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని జీపీపీ (గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని ఆర్టీసీ డిపో ఆవరణలో గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ లోగోతో కూడిన జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది అక్టోబర్ 15 నుంచి జనవరి 22 వరకు టీఎస్ ఆర్టీసీలో వంద రోజుల పండగ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండగలు చాలెంజ్‌గా తీసుకొని ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేయాలని ఉద్యోగులకు సూచించారు. ఆర్టీసీ యాజమాన్యం ప్రవేశపెట్టిన అన్ని కార్యక్రమాలను నిర్వహించిన విధంగా గ్రాండ్ ఫెస్టివల్‌ను సైతం విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ కనకలక్ష్మి, ఎంఎఫ్ వీరాచారి, ఏడీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



చేర్యాల: బతుకమ్మ ఆడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. సోమవారం మూడో రోజు ముద్ద పప్పును నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం మహిళలు బతుకమ్మ ఆడి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సందడి చేశారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉద్యమించాలి

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి రాజకీయ పార్టీలు చొరవ చూపాలని నాచారం దేవస్థాన మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి డిమాండ్ చేశారు. నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ప్రజ్ఞాపూర్‌లో జరిగింది. కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పార్టీలు ముదిరాజ్ కులాన్ని వీడదీస్తూ కుతంత్రాలకు పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన ముదిరాజ్ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి

సంక్షిప్త వార్తలు

◆ **న్యూట్రిషన్ కిట్లు పంపిణీ**

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్యాధికారి రజిత న్యూటిషన్ కిట్లను పంపిణీ చేశారు.

◆ **ఫిర్యాదు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులో చెక్‌డ్యాంను కూల్చిన ఇల్లంతకుంట ఎంపీపీ, ఆయన అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బెజ్జంకి తహసీల్దార్ శ్యాం, ఎస్‌ఐ నరేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **దుబ్బాక టికెట్ కేటాయించాలి**

తొగుట(దుబ్బాక): వైఎస్సార్‌టీపీ దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని మండలంలోని సూరంపల్లికి చెందిన మందాడి విజయభాస్కర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు.

◆ **మహాసభలను జయప్రదం చేయండి**

కోహెడ(హుస్నాబాద్): ఈనెల 29, 30న హైదరాబాద్‌లో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి అంతయ్య పిలుపునిచ్చారు. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

◆ **దళితుల అభివృద్ధికి కట్టుబడాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): తరతరాలుగా అంటరానితనం, కుల వివక్షకు గురవుతున్న దళితులకు అభివృద్ధి, రక్షణతో పాటు సమగ్ర అభివృద్ధికి పార్టీలు కట్టుబడి ఉండాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. సోమవారం అనంతసాగర్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

◆ **నాచగిరిలో స్వాతి నక్షత్ర మహోత్సవం**



వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో సోమవారం స్వాతి నక్షత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా గర్భగుడిలో మూలవిరాట్‌కు విశేష అభిషేకం జరిపారు. యాగశాలలో నారసింహ మూల మంత్ర హవనం, పూర్ణాహుతి నిర్వహించారు.

◆ **సీఎంకు చేర్యాల పెయింటింగ్**

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు చేర్యాల నకాషీ పెయింటింగ్‌తో రూపొందించిన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం చిత్రపటాన్ని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు అందజేశారు.

◆ **పరామర్శ**

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని కోదండరావుపల్లి మాజీ సర్పంచ్ గజ్వేల్ భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా సోమవారం వారి కుటుంబాన్ని మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు.

◆ **నేడు రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారం**

తొగుట(దుబ్బాక): మండలంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం తెలిపారు.

◆ **నూతన నియామకం**

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటకు చెందిన గట్టు శ్రీకాంత్‌ను నియమించారు. ఈమేరకు సోమవారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నియామకపత్రం అందించారు.

◆ **బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధిగా గోపినాథ్‌రెడ్డి**

సిద్దిపేటరూరల్: రూరల్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా తోర్నాలకు చెందిన గోపినాథ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ **పూర్వ విద్యార్థుల ఔదార్యం**



ములుగు(గజ్వేల్): తమతో కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యంతో మృతిచెందగా పూర్వ విద్యార్థులు అతడి కుటుంబానికి రూ. 1,11,500 ఆర్థికసాయం అందించి ఉదారత చాటుకున్నారు. ములుగు మండలం సింగన్నగూడకు చెందిన తాళ్ల రాముగౌడ్ కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తున్కిఖాల్సా జెడ్పీ హైస్కూల్‌లో 2001-2002 బ్యాచ్ పూర్వవిద్యార్థులు సోమవారం కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

◆ **బాధిత కుటుంబాలను ఆదుకోవాలి**

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జాలిగామలో విద్యుదాఘాతంతో మృతిచెందిన తండ్రీ, కొడుకు కుమ్మరి కనకయ్య, భాస్కర్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన బండి నర్సింలు కొడుకు ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో మృతిచెందగా వారిని సైతం పరామర్శించారు.